క్లుప్తంగా

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



మూసాపేట: నగరంలో చలి ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్న అభాగ్యులను భగీచసింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన మధుసూదన్, సుమన్‌కు ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెంకట్, సాయికిషోర్, భీమరాజు, మురళి, తమ్మినాయుడు, గజపతి, నవీన్, సాయిరామ్, అనిల్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆల్విన్‌కాలనీ: కొన్ని రోజులుగా అస్వస్థతకు గురై బాధపడుతున్న పాపమ్మ బస్తీ వ్యవస్థాపకురాలు పాపమ్మను ఆమె నివాసంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలనీ సంక్షేమానికి పాపమ్మ ఎంతో కృషి చేశారని ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

యువకుడి అదృశ్యం



కొనకంచి రామకృష్ణ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: అప్పుల బాధలు తట్టుకోలేక ఓ యువకుడు ఇంట్లో నుంచి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సుమిత్రానగర్‌లోని వివేకానంద ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న కొనకంచి రామకృష్ణ వడ్డీ వ్యాపారంలో నష్టపోయాడు. దీంతో అప్పు తీసుకున్న వారికి చెల్లించలేక పోయాడు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అతని సెల్‌ఫోన్‌కు బంధువులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత వెతికినా ఫలితం లేకపోవటంతో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొ.షాహిద్ నౌఖేజ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



రాయదుర్గం: మనూ ప్రొఫెసర్ షాహిద్ నౌఖేజ్ అజ్మీకు ఇరాన్ దేశ ప్రతిష్టాత్మక సాది అంతర్జాతీయ అవార్డు లభించింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్‌లో ఆయన ప్రొఫెసర్. పర్షియన్ భాష, సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇరాన్ ప్రభుత్వం నుంచి 'జైజా సాది'ని అందుకున్నారు. ప్రొఫెసర్ షాహిద్‌నౌఖేజ్ ఇప్పటివరకు 26 పుస్తకాలు రచించగా, 98 విద్యా, పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, అధికారులు అభినందించారు.

'మనూ' కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్స్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ (డీఎస్‌డబ్ల్యూ), కల్చరల్ క్లబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు, పలు రకాల కార్యకలాపాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ రోజారాణి



పార్కును పరిశీలిస్తున్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తున్న పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని బొల్లారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రోజారాణి అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పలు పార్కులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అత్యధిక పన్నులు చెల్లిస్తున్న నియోజకవర్గంలో..

అభివృద్ధి పనులు సున్నా..

బీజేపీ సీనియర్ నాయకుడు యోగానంద్



భాగ్యనగర్‌కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యోగానంద్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: రాష్ట్రంలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం అతి పెద్దదని.. ప్రభుత్వానికి ఇక్కడి నుంచే అత్యధిక పన్నులు చెల్లిస్తున్నా... ఇక్కడి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని బీజేపీ నాయకులు గజ్జల యోగానంద్ అన్నారు. ప్రభుత్వానికి అత్యధిక శాతం పన్నులు చెల్లిస్తున్న ఈ నియోజకవర్గం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని పేర్కొన్నారు. బుధవారం భాగ్యనగర్ కాలనీలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజుల పాటు ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారని తెలిపారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, దోమల వృద్ధి, మంచినీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యల నడుమే ప్రజలు జీవనం కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. డివిజన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు కొన్ని చోట్ల సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి వదిలేశారన్నారు.

◆ రోడ్లు వేసిన కొన్ని రోజులకే తవ్వకాలు..

రోడ్ల నిర్మాణం చేపడితే సుమారు 20 ఏళ్ల వరకు నాణ్యతతో ఉండాలన్నారు. అయితే వివిధ శాఖల సమన్వయ లోపంతో రోడ్లు వేసిన కొద్ది రోజులకే అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను తవ్వి పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ వసతులు లేక కార్పొరేట్ స్కూళ్లకు పిల్లలు..

ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవటమే తప్ప ఆ దిశగా అమలు చేసిన దాఖలాలు కనిపించటం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, మౌలిక వసతులు అరకొరగా ఉన్నాయన్నారు. కొంత మంది చిన్నారులు మధ్యాహ్నం భోజనం మంచిగా లేకపోవడంతో ఇంటి నుంచే భోజనం తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్య, వైద్యంలో ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని మంత్రులు ప్రగల్భాలు పలకటమే తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. అందుకే ప్రజలు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు.

◆ ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కరువు..

ప్రభుత్వ భూములను పరిరక్షించి ప్రజల కోసం వినియోగించకుండా అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని వాపోయారు. మరో వైపు ప్రభుత్వ భూములు, చెరువులను మింగేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజిత్ వర్మ, నరేందర్‌రెడ్డి, కేశవరావు, రామరాజు, కమలాకర్, రవీందర్‌రావు, స్రవంతి, రాంరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభివృద్ధికి మంత్రి తలసాని ఏం చేశారు?

- కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయించలేని అసమర్థ మంత్రి రాజీనామా చేయాలి
- యాదవ సంఘం నాయకుడు కుమార్‌యాదవ్



జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్ర జనాభాలో 20శాతం ఉన్న యాదవుల అభ్యున్నతి కోసం యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. అరెస్టుకు నిరసనగా బుధవారం అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన యాదవులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఉన్న యాదవ నాయకులను పరామర్శించడానికి వెళ్లిన యాదవ సంఘం నాయకుడు కుమార్‌యాదవ్ మీడియాతో మాట్లాడారు.

◆ యాదవుల అభివృద్ధి కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బడ్జెట్‌లో మార్పులను సవరించి అసెంబ్లీ సమావేశాలలోపు రూ.10వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. యాదవులను కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలకు మాత్రమే వాడుకోవటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో కొనసాగుతున్న తలసాని శ్రీనివాసయాదవ్ యాదవుల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పించలేని అసమర్థ మంత్రి తలసాని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకపోతే రాష్ట్రంలో ఉన్న యాదవులందరూ పెద్దఎత్తున ప్రగతిభవన్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, బాలుయాదవ్, ఉదయ్‌యాదవ్, అంజన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరుల పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. వసంత్‌నగర్‌కాలనీలో జరుగుతున్న యూజీడీ పైపులైన్, 6వ ఫేజులోని నూతనంగా నిర్మిస్తున్న ఫుట్‌పాత్ పనులను పర్యవేక్షించారు. 9వ ఫేజులోని మహిళా మండలి పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాల పనితీరుపై ఆరా తీశారు. డివిజన్‌లో అభివృద్ధి పనులను పూర్తి చేయటంలో సహకరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే క్రీడా మైదానాలు, పార్కులు కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్‌లు పాల్గొన్నారు.

శ్రీవివేకానందనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: శ్రీవివేకానందనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం స్థానికులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గర్భిణులు, ఐదేళ్ల లోపు చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గతంలో ఈ కాలనీ మహిళలు ఇతర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని ఆమె గుర్తు చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇక్కడే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయటంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు రోణంకి జగన్నాథం, వీవీనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిట్ల రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకటేష్, బ్రహ్మం, లక్ష్మి, అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డా.అలివేలు మంగమ్మ



కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కూకట్‌పల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.అలివేలు మంగమ్మ మాట్లాడారు. విద్యార్థులు పరిసరాల శుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా తమ చుట్టూ ఉన్న ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అపరిశుభ్రత వల్ల అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల మొత్తం దేశం స్వచ్ఛ దేశంగా తయారవుతుందని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందు ఉండాలని కోరారు. అదే విధంగా నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. భవాని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జి.రవికుమార్, డా. ఐ.వాణి, అధ్యాపకులు రాఘవేందర్, జోసఫ్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సట్ల అంజలికి ఉత్తమ నంది అవార్డు



అంజలిని సత్కరించిన ఎమ్మెల్సీ బసవరాజ్

దుండిగల్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కళాకారిణి సట్ల అంజలికి తెలంగాణ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉత్తమ నంది అవార్డు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం సభ్యులు, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య ఆధ్వర్యంలో బుధవారం అంజలిని సత్కరించారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

నిజాంపేట్: ప్రభుత్వ భూమిని అక్రమించి అనుమతులు పొందిన స్థలాన్ని పరిరక్షించాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. బాచుపల్లి సర్వే నం.186లోని 1600 గజాల ప్రభుత్వ భూమిని గతంలో కొందరు వ్యక్తులు ఆక్రమించుకోగా అప్పటి కమిషనర్ గోపీ అడ్డుకున్నారని, తాజాగా ఇదే స్థలం విషయమై హెచ్‌ఎండీఏ నుంచి భవన నిర్మాణానికి అనుమతులు పొందారన్నారు. సర్వేనం.182 ప్రైవేట్ సర్వే నంబరుతో సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. ఈ విషయమై విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. బుధవారం మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ పోలీసులకు రివార్డులు

నిజాంపేట్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి బుధవారం సీపీ స్టీఫెన్ రవీంద్ర రివార్డులు అందజేశారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 5వ తేదీన గంజాయి విక్రయదారుడిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి 41 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీస్ సిబ్బందిని సత్కరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ నర్సింహారెడ్డి, ఎస్సై సాయినాథ్, కానిస్టేబుళ్లు రాజు, రాజేష్‌కుమార్, కనకయ్య, హరిలాల్‌నుప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ 17వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి బుధవారం జల మండలి అధికారులకు వినతి పత్రం అందజేశారు. కొత్త పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా అధికంగా వస్తున్న నీటి బిల్లులను మాఫీ చేయాలన్నారు.

పోస్టాఫీస్‌లో అన్నివర్గాలకు అనువైన పథకాలు

అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వరరావు



పోస్టాఫీస్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్

బాలానగర్: పోస్టాఫీస్‌లో అన్ని వర్గాల ప్రజలకు అనువైన పథకాలు ఉన్నాయని కూకట్‌పల్లి అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్‌లోని ఫిరోజ్‌గూడలో పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో పలు పోస్టాఫీస్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు నచ్చిన పథకాన్ని ఎంచుకొని పోస్టాఫీస్‌లో క్రమబద్ధంగా నగదు పొదుపు చేసుకుంటే జీవితం భద్రంగా ఉంటుందన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారికి సీనియర్ సిటిజన్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్‌కం స్కీమ్, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్, ప్రమాద బీమా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. పోస్టాఫీస్ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మ్యాన్ ప్రవీణ్‌కుమార్, కిషన్, స్వాతి, స్థానికులు ఎడ్ల అనిల్‌కుమార్, ధనరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూర్తయిన అభివృద్ధి పనుల పరిశీలన



ముష్కిపేటలో నిర్మించిన సీసీరోడ్డును పరిశీలిస్తున్న తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: డివిజన్‌లోని ముష్కిపేట్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తవడంతో ఆ ప్రాంతంలో సీసీరోడ్డును నిర్మించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ బుధవారం పూర్తయిన పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే కృష్ణారావు ఎంతో ముందుచూపుతో డివిజన్‌లో సమస్యలను గుర్తించి వెనువెంటనే పరిష్కరిస్తున్నారని ఆయన అన్నారు. మూసాపేట డివిజన్‌లో ఏమైనా సమస్యలుంటే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రమేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, తుకారాం, విష్ణు, నర్సింహ, కిరణ్, అరుణ్, నర్సింగ్, అశోక్, సీతారాం, రాము, వినోద్, సతీష్, నారాయణ, హరిత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ నుంచి ప్రవహిస్తున్న నాలాను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నాలా వల్ల వర్షాలు వచ్చినప్పుడు ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని, తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నగర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఈఈ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకుంటున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని బలరాం నగర్ కాలనీలోని షిరిడీ సాయిబాబా దేవాలయం 12వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వెంకటేష్, సురేష్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, దేవేందర్, వెంకటేష్, శాంతమ్మ, లక్ష్మి బాబాను దర్శించుకున్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతి నిరుపేదకు న్యాయం

- హాత్‌సే హాత్ జోడో యాత్రలో టీపీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం



వెంకటేశ్వరనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జరిపేటి జైపాల్



బాలానగర్ డివిజన్‌లో హాత్‌సే హాత్ జోడో యాత్రను ప్రారంభిస్తున్న డా. సత్యం శ్రీరంగం

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని డీఎస్‌కాలనీలోని పీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం హాత్‌సే హాత్ జోడో యాత్ర (మూడో రోజు)ను టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పత్తికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ యాత్ర బాలానగర్ డివిజన్‌లోని చెరబండ రాజునగర్, రాజుకాలనీ, వినాయక్‌నగర్ లలో కొనసాగింది.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ యాత్ర ఉద్దేశమన్నారు. కేసీఆర్ ధనిక రాష్ట్రంలో ఉన్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్ల పాలనలో ప్రతి నిరుపేదకు న్యాయం జరిగిందన్నారు. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని గెలిపించుకోవాలన్నారు.

◆ రాష్ట్రంలో బీఆర్ఎస్ అహంకార పరిపాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, రాజేందర్, మధుమోహన్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్‌లో యాత్ర షురూ..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హాత్‌సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జరిపెటి జైపాల్ మాట్లాడుతూ... ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేసి వారి సమస్యల పరిష్కార ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యప్రకాశరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, మూకయ్య, నాగుల మల్లేష్, యాదగిరి, భూషణం, రేణుక, మలేష్, మార్గెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.